క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

స్టేషన్ మహబూబ్‌నగర్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ సుజాత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 4 గంటల వరకు ప్రయాణికుల సూచనలు, సలహాలను 9959226286 నంబర్‌కు తెలియజేయాలని ఆమె కోరారు.

మున్సిపల్ చైర్మన్ మార్నింగ్ వాక్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మెట్టుగడ్డలోని బీఈడీ కళాశాల ఆవరణలో మంగళవారం ఉదయం సీనియర్ సిటిజన్స్, యువకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ మార్నింగ్ వాక్ చేశారు. కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ఇక్కడ ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని యువకులు విన్నవించగా, పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

చిన్నరాజమూర్‌లో పూజలు

దేవరకద్ర: మండలంలో ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వ్యక్తి ప్రాణం కాపాడిన పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: వ్యాపారంలో నష్టంతో పాటు ఏం చేసినా సక్సెస్ కావడం లేదని తీవ్ర మనస్థాపం చెందిన వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో టూటౌన్ పోలీసులు రక్షించారు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన వ్యక్తి మెడికల్ రిప్‌గా పని చేస్తున్నాడు. జీతం సరిపోకపోవడంతో పాటు వ్యాపారంలో ఏది చేసినా సక్సెస్ కావడం లేదని తీవ్ర మనస్థాపం చెందాడు. సోమవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సీఐ ఆదేశాల మేరకు ఘటనా స్థలానికి చేరుకొని వ్యక్తిని రక్షించారు. అనంతరం అతన్ని స్టేషన్‌కు తీసుకొచ్చి సీఐ ప్రత్యేక కౌన్సిలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో టూటౌన్ సీఐతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విచారణకు జిల్లా అధికారులు

నవాబుపేట: మండలంలో శానిటేషన్ వస్తువుల కొనుగోలుకు సంబంధించి వస్తున్న అవినీతి ఆరోపణలపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ఆదేశాలతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీనికి గాను ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ సందర్భంగా మండలంలో పర్యటించే విచారణ బృందంలో జిల్లా అదనపు కలెక్టర్, జెడ్పీసీఈఓ, జిల్లా పంచాయతీ అధికారులతో కూడిన ముగ్గురు సభ్యులు ఉన్నారు. 54 గ్రామ పంచాయతీలలో దాదాపుగా 20 పంచాయతీలకు పైగా శానిటేషన్ వస్తువులు అధిక ధరలకు కొనుగోలు చేసినట్లు తీవ్ర ఆరోపణలు ఉండగా, వాటికి సంబంధించి మండల అధికారుల పాత్రపై చర్చ నిర్వహిస్తారు. విచారణ బృందం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు రానుండటంతో జిల్లా అధికార యంత్రాంగం సైతం తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలుస్తోంది.

స్వచ్ఛభారత్‌లో భాగస్వాములు కావాలి

మిడ్జిల్: స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని వెంకటేశ్వర పారా మెడికల్ కళాశాలలో సంత్‌సేవాలాల్ మహారాజ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్‌ఐ పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేష్, యువజన సంఘం అధ్యక్షులు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి రెండ్రోజుల జైలు శిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చేసిన డ్రంకెన్ డ్రైవ్‌లో మహేష్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. తనిఖీ చేయగా 315 శాతం ఆల్కహాల్ తాగినట్లు నిర్ధారణ అయ్యింది. దీంతో పోలీసులు అతన్ని మంగళవారం కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి ఆర్.శశిధర్ రూ.2వేల జరిమానా, రెండు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు మహేష్‌ను జైలుకు తరలించారు.

నేటి నుంచి జలజం ఇంటర్ స్కూల్ క్రికెట్ ట్రోఫీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం పిల్లలమర్రి రోడ్డులోని ఎండీసీఏ మైదానంలో బుధవారం నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు 3వ జలజం సత్యనారాయణ ఇంటర్ స్కూల్ టీ-10 క్రికెట్ ట్రోఫీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రికెట్ టోర్నీలో 26 పాఠశాలల జట్లు పాల్గొంటున్నాయని, నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మలుపు తిరిగిన 'పింఛన్ స్వాహా'

- మృతుడి భార్య ఫొటో స్థానంలో మరో మహిళది పెట్టిన వైనం
- సంతానం లేకపోగా.. భార్య నిరక్షరాస్యురాలు
- దత్తత తీసుకున్న యువకుడికి 2013లో పీహెచ్‌డబ్ల్యూ ఉద్యోగం
- పింఛన్ మాత్రం వరుసకు చిన్నమ్మ అక్రమంగా పొందిన తీరు
- అందుకు ఇద్దరు సహకరించినట్లు విచారణలో తేలిన వైనం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ వర్కర్ (పీహెచ్‌డబ్ల్యూ) గా పని చేస్తున్న ఎ.చిన్ననర్సయ్య 2012 జూన్ 21న అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయనకు భార్య ఎ.నాగమ్మ ఉండగా సంతానం కలగలేదు. స్థానిక వీరన్నపేటకు చెందిన సమీప బంధువు శివకుమార్‌ను 2004లో దత్తత తీసుకున్నారు. ఆ సమయంలో ఆమె సంకతం లేకుండా దత్తతకు సంబంధించిన రిజిస్ట్రేషన్ తంతు పూర్తిచేసి ధ్రువపత్రం పొందారు. నాగమ్మ నిరక్షరాస్యులు కావడంతో ఈ యువకుడు కారుణ్య నియామకం కింద దరఖాస్తు చేసుకోగా 2013లో పీహెచ్‌డబ్ల్యూగా మున్సిపల్ అధికారులు ఉద్యోగ అవకాశం కల్పించారు. ఇంత వరకు బాగానే ఉన్నా పింఛన్ మంజూరు కోసం అవసరమయ్యే ధ్రువపత్రాలన్నింటికీ చివరకు బ్యాంకు ఖాతాలో సైతం ఏకంగా నాగమ్మ ఫొటో స్థానంలో సమీప బంధువు నర్సమ్మది పెట్టారు. అందుకు సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను నర్సమ్మ కొడుకు సిద్దయ్య, దత్తత కుమారుడు శివకుమార్ సృష్టించి ఎవరికీ అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డారు. కాగా, అన్ని సరిగ్గానే ఉన్నాయనుకుని భావించిన అప్పటి సీనియర్ అసిస్టెంట్లు మహమ్మద్ ఖాజా (ప్రస్తుత ఆర్‌ఓ), ఒమేందర్‌సింగ్ (ప్రస్తుతం సిద్దిపేట మున్సిపాలిటీలో మేనేజర్), ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్ సి.శశిధర్ (ప్రస్తుత ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్) నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు సమర్పించారు. దీంతో 2014 మార్చి 18న పింఛను మంజూరైంది. అప్పటి నుంచి ప్రతినెలా సుమారు రూ.25 వేలు ఠంచన్‌గా బ్యాంకు ఖాతాలో పడ్డాయి. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న బాధితురాలు నాగమ్మ జిల్లా కలెక్టరేట్‌లో 2016 ఆగస్టు 29న 'ప్రజావాణి'లో ఫిర్యాదు చేసినా స్పందన కరువైంది. చివరకు 2017 మే 5న ఆమె మృతి చెందింది. ఇక అక్రమంగా పింఛను పొందుతూ వచ్చిన నర్సమ్మ సైతం 2020లో చనిపోయింది. అప్పటికే ఆరేళ్ల కాలంలో సుమారు రూ.18 లక్షలతో పాటు ఇతర బెనిఫిట్స్ సైతం డ్రా అయ్యాయి. అనంతరం ఈ వ్యవహారంపై అప్పటి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు విచారణకు ఆదేశించారు. 2021లో మూడు నెలల పాటు సాగిన ఈ విచారణలో నిందితులుగా వరుసకు సోదరులైన శివకుమార్ (ప్రస్తుతం వనపర్తి మున్సిపాలిటీలో హెల్త్ అసిస్టెంట్), సిద్దయ్య (మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని వాటర్ వర్క్స్‌లో లైన్‌మన్) పేర్కొంటూ హైదరాబాద్‌లోని సీడీఎంఏకు నివేదిక సమర్పించారు. దీంతో 2020 సెప్టెంబర్ నుంచి పింఛన్ ఆగిపోయింది. అలాగే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుని స్వాహా అయిన మొత్తం రికవరీ చేయాలని అక్కడి నుంచి ఆదేశాలు వచ్చినా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకపోవడం గమనార్హం.

మాకెలాంటి సంబంధం లేదు

ఇదిలాఉండగా ఈ మొత్తం వ్యవహారంలో తమకెలాంటి సంబంధం లేదని ఆర్‌ఓ మహమ్మద్ ఖాజా, సిద్దిపేట మేనేజర్ ఒమేందర్‌సింగ్, ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ సి.శశిధర్ ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. తాము అప్పట్లో ఆయా విభాగాల్లో పనిచేసినప్పుడు నిబంధనల మేరకు ఈ పింఛన్‌కు సంబంధించిన ధ్రువపత్రాలు సమర్పించినట్లు భావించి మంజూరుకు నివేదిక తయారు చేశామన్నారు. అంతే తప్పా ఇందులో తమ ప్రమేయమేమీ లేదన్నారు. ఈ మొత్తం వ్యవహారానికి బాధ్యులైన శివకుమార్, సిద్దయ్యలపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఓటు హక్కు ప్రాముఖ్యతపై యువతకు అవగాహన కల్పించాలని, అర్హులైన వారిని ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఓటరు ముసాయిదా జాబితాపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 28 వరకు నూతనంగా ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. నవంబర్ 9, 10 తేదీల్లో ఓటర్ నమోదుకు బూత్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. మార్పులు చేర్పులు చేసుకోదలిచిన వారు ఫారం-8 ద్వారా, అదేవిధంగా ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదుకు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఐ కార్యాలయం, ఠాణాను తనిఖీ చేసిన ఎస్పీ



మొక్కలు నాటుతున్న ఎస్పీ జానకి

భూత్పూర్: పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయం, పోలీస్ ఠాణాను జిల్లా ఎస్పీ జానకి మంగళవారం తనిఖీ చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా భూత్పూర్ ఠాణా ఎదుట ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు మొక్కలు నాటారు. అనంతరం సర్కిల్ కార్యాలయంతో పాటు ఠాణాలో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ వెనుక క్వాటర్‌లోని ఫోరెనిక్స్ ల్యాబ్‌ను తనిఖీ చేశారు. ఎస్పీ వెంట సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.



ఇచ్చిన హామీలు అమలు చేస్తాం

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి
- ఆయా గ్రామాల్లో ప్రారంభోత్సవాలు



అన్నారెడ్డిపల్లిలో బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మహమ్మదాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నిలబెట్టుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అన్ని రకాలుగా కృషి చేస్తున్నారని, త్వరలో హామీలన్నీ నెరవేరుస్తామని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఎల్కిచెరువు తండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని, అన్నారెడ్డిపల్లి వాగు దగ్గర బ్రిడ్జిని, చిన్నాయపల్లి, బాపనికుంటతండా బీటీరోడ్డును, వెంకట్‌రెడ్డిపల్లి, అన్నారెడ్డిపల్లి దగ్గర వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ఇప్పటికే రైతు రుణమాఫీ, ఫ్రీ బస్సు, ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు వడ్డీలేని రుణాలు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం మన అందరిని అప్పులపాలు చేసి వడ్డీలు కట్టే పరిస్థితి తీసుకొచ్చారని తెలిపారు. త్వరలో మహమ్మదాబాద్ గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, జితేందర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, కమతం శ్రీనివాస్‌రెడ్డి, రాంలాల్, శాంతిబాయి, రాధారెడ్డి, పీఆర్ డీఈ సురేందర్‌రెడ్డి, ఏఈ ముఖీమ్ పాల్గొన్నారు.

పీయూలో లా, ఇంజినీరింగ్ కళాశాలలకు స్థల పరిశీలన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో నూతన లా, ఇంజినీరింగ్ కళాశాలల భవనాల నిర్మాణానికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ మేరకు నిర్మాణంలో ఉన్న రీసెర్చ్ ఫెసిలిటీ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుపై హర్షం..

పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజినీరింగ్ కళాశాలల ఏర్పాటుపై ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాము, రాజు, రాజశేఖర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైతుకు విద్యుదాఘాతం

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు చేస్తుండగా రైతు రాజు విద్యుదాఘాతానికి గురయ్యాడు. చేతులు, కాళ్లకు తీవ్రంగా గాయాలు కావడంతో 108లో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యార్థుల ధర్నా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు 2019-2024 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ చౌరస్తాలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ

ఎస్‌యూపీపై కళాజాత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎట్టి పరిస్థితుల్లోనూ సింగిల్ యూజ్‌డ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) వస్తువులను వాడొద్దని మంగళవారం కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో విద్యార్థులకు, మెట్టుగట్ట కూడలిలో పట్టణ ప్రజలకు విన్నవించారు.

పీఆర్సీ ప్రకటించాలి

జడ్చర్ల టౌన్: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్ష నిర్వహించారు. మంగళవారం జడ్చర్ల శాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్ బ్రహ్మగౌడ్‌కు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మధుసూదన్‌గౌడ్, కృష్ణవాల్మీకి, కృష్ణ, సుధాకర్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్

దేవరకద్ర: పట్టణంలో ఎల్‌ఆర్‌ఎస్ ఆన్‌లైన్ నమోదు కొనసాగుతున్నది. దేవరకద్ర మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో దాదాపు 4500 మంది ప్లాట్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం గతంలో రూ.వేయి చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం దరఖాస్తులు చేసుకున్న వారి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలించి ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు.

ముడా పరిధిని పెంచి అన్యాయం చేయకండి

జడ్చర్ల టౌన్: ముడా పరిధిని విస్తరించి గ్రామాలకు అన్యాయం చేయొద్దని సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జడ్చర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సహకరించిన వారికి కృతజ్ఞతలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో మంగళవారం చేపట్టిన బంద్ విజయవంతమైనట్లు పలువురు ముస్లిం సంఘాల ప్రతినిధులు అన్నారు. క్లాక్ టవర్ వద్ద వారు మాట్లాడారు.



కళాశాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేద్దాం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుకన్య

జడ్చర్ల టౌన్: బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేద్దామని, అందుకు పూర్వవిద్యార్థుల సహకారం అందించాలని కళాశాల ప్రిన్సిపల్ డా.సుకన్య కోరారు. మంగళవారం మధ్యాహ్నం కళాశాల పూర్వ విద్యార్థుల చాంబర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. కళాశాల అటానమస్ గుర్తింపు వచ్చినందుకు తగినట్లుగా తాము పాటుపడతామన్నారు. అటానమస్ వచ్చిన కళాశాలలో ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మించేందుకు నిధులు వస్తాయని, ఆ దిశగా తాము కృషిచేస్తామని అకాడమిక్ కో ఆర్డినేటర్ సులేమాన్ వెల్లడించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రాంమోహన్ మాట్లాడారు. సమావేశంలో అధ్యాపకులు డా.సదాశివయ్య, సంఘం ప్రధానకార్యదర్శి బి.రవిశంకర్ జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్యతో పాటు పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక రోగాలు నయం



బాలానగర్‌లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హరికుమార్

రాజాపూర్ (బాలానగర్): ఆయుర్వేదవైద్యంతో దీర్ఘకాలిక రోగాలు నయం అవుతాయని ప్రభుత్వ ఆయుర్వేదవైద్యశాల వైద్యులు డాక్టర్ హరికుమార్ తెలిపారు. మంగళవారం బాలానగర్ మండలంలోని ఏకలవ్యగురుకుల పాఠశాలలో ధన్వంతరి జయంతి సందర్భంగా ఉచిత ఆయుర్వేదవైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన పూర్వ కాలంలో ఆయుర్వేద వైద్యంతోనే రోగాలు నయం అయ్యేవన్నారు. అనంతరం 117 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి, ఫార్మసిస్టు ఉత్తరయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ మారిన కౌన్సిలర్లకు నోటీసులు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

జడ్చర్ల టౌన్: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన నలుగురు కౌన్సిలర్లకు నోటీసులు జారి చేసినట్లు బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పి.మురళి తెలిపారు. మంగళవారం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. బీఆర్ఎస్ ద్వారా గెలుపొందిన 1వ వార్డు ఫహిమినాజ్, 6వ వార్డు సుంకసారి రమేష్, 9వవార్డు చైతన్య చౌహాన్, 20వవార్డు శ్రావణిలకు పార్టీ అధిష్టానం సూచనల మేరకు నోటీసులు జారీ చేశామన్నారు. త్వరలో చైర్‌పర్సన్ ఎన్నిక జరగబోతున్నందున పార్టీ విప్ జారీ చేస్తుందని, పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తమ నాయకుడు డా.లక్ష్మారెడ్డి సారథ్యంలో చైర్‌పర్సన్‌ను నిర్ణయిస్తామని, మున్సిపాలిటీలో తమకు పూర్తి మెజార్టీ ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ యాదయ్య, మండల అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ప్రణీల్‌చందర్, రాంమోహన్ పాల్గొన్నారు.

5న బీసీ గర్జన

మహబూబ్‌నగర్ రూరల్: బీసీ కమిషన్ డిసెంబర్ రెండో వారంలోగా కుల గణన పూర్తి చేస్తామని ప్రకటించి తగు కార్యాచరణ రూపొందించడం హర్షణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవంబర్ 8న జరిగే బీసీ కమిషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనను బీసీలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్దన్ మాట్లాడుతూ బీసీలకు ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్ వల్ల జీఓ 29 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేశాయని తెలిపారు. బీసీ కులగణనపై చర్చించడానికి నవంబర్ 5న మహబూబ్‌నగర్‌లో నిర్వహిస్తున్నామన్నారు. బీసీ మేధావుల సంఘం అధ్యక్షుడు జి.పాండురంగం మాట్లాడుతూ బీసీ కులాల వాళ్లు వారి కులాల పరిస్థితి గురించి కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని, అందుకోసమే గర్జన నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

